# ప్రజా సంక్షేమ పథకాలపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంచాలి

**జిల్లా అధికారులకు కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశాలు**





**కాకినాడ, పెన్ పవర్,జూన్ 4:** ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజల్లో నమ్మకం, సంతృప్తి స్థాయిని (పాజిటివ్ పబ్లిక్ పెర్సెప్షన్) పెంపొందించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అందుతున్న పౌర సేవలపై ప్రజల సానుకూల అభిప్రాయ స్థాయిలను ఆయన సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా అన్నా క్యాంటీన్లు, బీసీ హాస్టళ్లు, అంగన్వాడీ కేంద్రాలు, కళాశాల విద్య, పోలీస్ శాఖ, దీపం-2, పట్టణ మరియు గ్రామీణ తాగునీటి సరఫరా, విద్యుత్ సేవలు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, మధ్యాహ్న భోజన పథకం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, ధాన్య సేకరణ, రేషన్ కార్డుల పంపిణీ, స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరు, కాలుష్య నియంత్రణ తదితర అంశాలపై ప్రజా సానుకూల అభిప్రాయాలను సమీక్షించారు.రాష్ట్ర సగటు స్కోరుతో పోలిస్తే జిల్లాలో తక్కువ స్కోరు నమోదైన శాఖల అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడిన కలెక్టర్, ఆ పరిస్థితులకు గల కారణాలను విశ్లేషించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలపై ప్రజల సానుకూల అభిప్రాయానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ శాఖలో పౌర సేవలపై ప్రజల సంతృప్తి స్థాయి కనీసం 85 శాతానికి పైగా ఉండేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు.ప్రస్తుతం గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని, వచ్చే నెల నాటికి అన్ని శాఖల్లో ప్రజా సానుకూల అభిప్రాయ సూచికలను మెరుగుపరచేలా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పెన్ పవర్


## కాకినాడ

## డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

## కూటమి ప్రభుత్వంలో శ్రీ నూకాంబికా అమ్మవారి ఆలయ అభివృద్ధి వేగవంతం.

**రూ.30 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు.**





**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 04;** చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయ అభివృద్ధి కూటమి ప్రభుత్వ హయాంలో వేగవంతం అయిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. నూకాంబిక అమ్మవారి ఆలయంలో దేవస్థానం నిధులు రూ.30 లక్షలతో చేపట్టిన ప్రదక్షిణ గ్రానైట్ చప్టా నిర్మాణం, క్యూలైన్ మార్గం వద్ద కాంక్రీట్ పనులను ఎమ్మెల్యే బండారు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించి,శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ ఆలయానికి తరలివచ్చే భక్తులకు అవసరమైన ప్రతీ సౌకర్యాన్ని కల్పించడం జరుగుతుందన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతీ శుక్రవారం, అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారని తెలిపారు. దాతలు ముందుకు వస్తే వారి పేరు మీద అన్నదానం చేయడం జరుగుతుందన్నారు. దాతలు రాని రోజున దేవస్థానం నిధులు వెచ్చించి అన్నదానం చేయడం జరుగుతుందన్నారు. ఆలయ అభివృద్ధికి భక్తులు సహకరిస్తున్నారని, దాతలు ముందుకు వస్తున్నారని ప్రశంసించారు. ఇప్పటివరకు 48 చండీ హోమాలు జరిగాయని, రాబోయే అమావాస్య రోజు 49వ చండీ హోమం జరుగుతుందన్నారు. 50వ చండీ హోమానికి ప్రత్యేకంగా పూర్తిస్థాయిలో దేవస్థానం యాగశాల నిర్మించి నిర్వహించాలని సూచించారు. సామూహికంగా గాని, వ్యక్తిగతంగా కానీ చండీ హోమం నిర్వహించుకునే భక్తులకు అనుకూలంగా యాగశాల, వసతుల ఏర్పాటు జరగాలన్నారు. ఈ అంశంపై ఈవో, చైర్మన్ లు యాగశాల ఏర్పాటు చేస్తామని తెలిపారన్నారు. ప్రతీ పౌర్ణమికి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించే విధంగా దేవస్థానం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ వీరి అప్పారావు గౌడ్ పాలకమండలి సభ్యులు,ఆకుల రామకృష్ణ,పాలూరి సత్యానందం, ఈదల సత్తిబాబు,ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలి



- కాలువలకు నీరు వదలక ముందే ఇరిగేషన్ పనులు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్
- మంజూరైన అన్ని పనులకు తక్షణమే గ్రౌండింగ్ పూర్తి చేయాలని ఆదేశం

**కాకినాడ, పెన్ పవర్,జూన్ 4:** జిల్లాలో వివిధ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రోడ్లు-భవనాలు, ఇరిగేషన్, డ్రైన్స్, పబ్లిక్ హెల్త్, పంచాయతీరాజ్, ఏపీఎంఎస్ఐడీసీ, ఏపీఈడబ్ల్యూఐడీసీ తదితర ఇంజనీరింగ్ శాఖల ద్వారా చేపట్టిన పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ సమీక్షించారు. వివిధ శాఖల పరిధిలో కొనసాగుతున్న పనుల ప్రస్తుత స్థితిగతులు, ఎదురవుతున్న సమస్యలు, పూర్తి స్థాయి పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం మంజూరు చేసిన అన్ని పనులకు తక్షణమే గ్రౌండింగ్ పూర్తి చేసి అమలు వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా ఇరిగేషన్ శాఖ చేపడుతున్న పనుల్లో కాలువలకు సాగునీరు విడుదల చేసే ముందు డీ-సిల్టింగ్ (పూడికతీత), షట్టర్లు, స్లూయిస్‌ల మరమ్మతులు, ఇతర సివిల్ వర్క్స్‌ను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఏపీఈడబ్ల్యూఐడీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న గురుకుల పాఠశాలల మరమ్మతులు, సామాజిక భవనాల నిర్మాణాలు, పీఎం-శ్రీ పాఠశాలల్లో లైబ్రరీలు, సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు.అలాగే ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా నిర్మిస్తున్న సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఆర్ఎంసీ పీజీ బాలికల వసతి గృహం, పిఠాపురం ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.పబ్లిక్ హెల్త్ శాఖ చేపట్టిన తాగునీటి ప్రాజెక్టులలో పురోగతి సాధించి గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు, నాబార్డ్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) రహదారుల నిర్మాణ పనులను కూడా వేగవంతం చేయాలని సూచించారు.వివిధ శాఖల పరిధిలో వివిధ దశల్లో ఉన్న అన్ని పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ ఎ.వి.ఎస్. శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు, ఆర్ అండ్ బీ ఎస్ఈ జీ. కాంతు, పబ్లిక్ హెల్త్, ఏపీఎంఎస్ఐడీసీ, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ విభాగాల ఎస్ఈలు, ఈఈలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణ మహోత్సవానికి రాష్ట్ర పండుగ హోదా...



**కోనసీమ బ్యూరో (అంతర్వేది) పెన్ పవర్, జూన్, 4**


డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ప్రతి ఏడాది వైభవంగా నిర్వహించే స్వామివారి కళ్యాణ మహోత్సవానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పండుగ (స్టేట్ ఫెస్టివల్) హోదా కల్పిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

గోదావరి నది సముద్ర సంగమ ప్రాంతంలో వెలసిన అంతర్వేది క్షేత్రం దక్షిణ భారతదేశంలో ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రంగా పేరుగాంచింది. ప్రతి సంవత్సరం మాఘమాసంలో జరిగే బ్రహ్మోత్సవాలు, స్వామివారి కళ్యాణ మహోత్సవం, రథోత్సవం వంటి కార్యక్రమాలకు రాష్ట్రం నలుమూలలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు.

ఈ నేపథ్యంలో అంతర్వేది క్షేత్ర ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ మహోత్సవాన్ని అధికారిక రాష్ట్ర పండుగగా ప్రకటించడం విశేషంగా మారింది. ఈ నిర్ణయంతో ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వ పరంగా మరింత ప్రాధాన్యం లభించడంతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, మౌలిక వసతుల అభివృద్ధికి అవకాశం కలగనుంది.

రాష్ట్ర పండుగ హోదా కల్పించినందుకు భక్తులు, స్థానిక ప్రజలు, దేవస్థాన అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయం అంతర్వేది క్షేత్ర ఖ్యాతిని మరింత పెంచి, ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధికి దోహదపడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయంతో అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి కళ్యాణ మహోత్సవం ఇకపై రాష్ట్ర స్థాయిలో మరింత వైభవంగా నిర్వహించబడనుంది.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు వెన్నుపోటు

- హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం
- పిఠాపురం వైఎస్ఆర్సిపి ఇన్చార్జి వంగా గీత

**కాకినాడ బ్యూరో (పిఠాపురం) పెన్ పవర్ జూన్ ,4:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా పిఠాపురం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వంగా గీత ఆధ్వర్యంలో "వెన్నుపోటుకు రెండేళ్లు" పేరుతో పార్టీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వంగా గీత మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా కేవలం ప్రచార ఆర్భాటాలతో కాలం గడుపుతోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు రెండేళ్లు గడిచినా ఇప్పటికీ అమలు కాలేదని మండిపడ్డారు. ప్రజలకు నిజాలు తెలియజేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు కొనసాగిస్తోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అమలైన సంక్షేమ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి ప్రత్యక్ష లబ్ధి చేకూరిందని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకాల అమలు ఆగిపోయిందన్నారు. "వైఎస్ జగన్ హయాంలో ప్రజలకు అందిన సంక్షేమం ఇప్పుడు కనిపించడం లేదన్నారు. యువతకు ఉద్యోగాల కల్పన విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మాట తప్పారని అన్నారు. మహిళలకు "ఆడబిడ్డ నిధి" కింద ప్రతి నెలా రూ.1,500 అందిస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. రైతులు, మహిళలకు సున్నా వడ్డీ రుణాల విషయంలో కూడా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని విమర్శించారు. రైతు సంక్షేమం, మహిళా సాధికారత పేరుతో ఎన్నికల సమయంలో ప్రచారం చేసిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ప్రజల తరఫున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు ఒత్తిడి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో గండేపల్లి రామారావు, రావుల మాధవరావు, తలిశెట్టి వెంకటేశ్వరరావు, వజ్రపు వీరేష్, నల్లమిల్లి పవన్ కుమార్, మొహిద్దిన్, అడపా రఘు, వర్జినీడి సుజాత, పచ్చిమళ్ళ జ్యోతి అప్పలరాజు, పెదపాటి నాగేశ్వరరావు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కూటమి హామీల అమలు లేదంటూ ఆత్రేయపురంలో వైఎస్సార్సీపీ నిరసన





**పెన్ పవర్ ఆత్రేయపురం, జూన్ 5** :కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ వైఎస్సార్సీపీ నాయకులు ఆత్రేయపురం బస్టాండ్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆత్రేయపురం జడ్పీటీసీ సభ్యుడు బోనం సాయిబాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. రైతులు, మహిళలు, యువతకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు వారి సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఎస్సీ సెల్ జిల్లా నాయకులు కప్పల శ్రీధర్ మాట్లాడుతూ మాయ మాటల చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అక్క చెల్లెమ్మలకు ప్రతి నెల 1500 రూపాయలు ఏమయ్యాయి అని 18 సంవత్సరాల నుండి పతి ఆడపడుచుకు ఇస్తానన్న హామీ తుంగలోకి తొక్కారని ఆయన ధ్వజమెత్తారు. ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్సీపీ శ్రేణులు మానవహారం ఏర్పాటు చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం టీడీపీ--కూటమి ఎన్నికల మేనిఫెస్టో ప్రతులను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్తపేట నియోజకవర్గంలో రూ.55.27 లక్షల సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

* ఎమ్మెల్యే బండారు సత్యానందరావు





**పెన్ పవర్ రావులపాలెం జూన్ 4:**కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ఆత్రేయపురం , రావులపాలెం, ఆలమూరు, కొత్తపేట లో ఉన్న 100 మంది లబ్ధిదారులకు రూ. 55,27,455 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గురువారం రావులపాలెం తెలుగుదేశం క్యాంప్ కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. మండలాల వారీగా ఆలమూరు మండలంలో 32 మందికి రూ. 16,26,742, కొత్తపేట మండలంలో 25 మందికి రూ. 13,47,722, రావులపాలెం మండలంలో 24 మందికి రూ. 17,56,963, ఆత్రేయపురం మండలంలో 19 మందికి రూ. 7,96,028 మేర సహాయం అందించారు. మొత్తం 100 కేసుల్లో 93 రీయింబర్స్‌మెంట్, 7 ఎల్ఓసీ (ఎల్ఓసీ) కేసులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా అందుతుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సహాయం పొందిన లబ్ధిదారులు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన ముఖ్యమైన నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# వంట పాత్రలు, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి





**పెన్ పవర్ ఆత్రేయపురం జూన్ 5:**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఎండీఎం ఏడీ సురేష్ సూచించారు. ఆత్రేయపురం మండలంలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో నిర్వహిస్తున్న 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' వంట నిర్వాహకులకు గురువారం ఉచ్చిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

మండల విద్యాశాఖాధికారులు పి.వి. ప్రసాదరావు, ఎ. సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న సురేష్ మాట్లాడుతూ పాఠశాల పరిసరాలు, వంట పాత్రలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారం తయారు చేయడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడవచ్చన్నారు. పాఠశాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత కూడా ప్రతి ఒక్కరూ పాటించాలని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ సిబ్బంది పాఠశాలల్లో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన చర్యలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకులు తయారు చేసిన వంటకాలను అధికారులు పరిశీలించి రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.వి. ప్రకాష్, ఉపాధ్యాయిని పద్మశ్రీ, సీఆర్‌పీ జాన్‌బాబు, మండలంలోని



వివిధ పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు పాల్గొన్నారు.

## బాటసారుల దాహార్తిని తీర్చుతూ ఆదర్శంగా నిలుస్తున్న అయ్యప్ప సేవా బృందం

**స్వామియే శరణం అయ్యప్ప నినాదాలతో 35 రోజులుగా నిరంతర చలివేంద్ర సేవలు**





**పెన్ పవర్ ఆత్రేయపురం, జూన్ 5** :మండుతున్న ఎండలు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో అయ్యప్ప స్వామి భక్తులు చేపట్టిన సేవా కార్యక్రమం పలువురి ప్రశంసలను అందుకుంటోంది. ర్యాలి రామకృష్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సెంటర్ వద్ద నిర్వహించిన చల్లివేంద్ర ఎంతోమంది దాహం దప్పిక తీరుస్తుంది. అయ్యప్ప స్వామి గురూజీ ఎస్.వి. ఆధ్వర్యంలో గత 35 రోజులుగా నిరంతరంగా చలివేంద్రం నిర్వహిస్తూ రహదారులపై ప్రయాణించే బాటసారులకు చల్లని తాగునీరు అందిస్తున్నారు. గురువారం అత్తిలి సత్యనారాయణ వారి తల్లి సూరమ్మ, అన్న అత్తిలి చంద్రరావు, వదిన నాగమణి జ్ఞాపకార్థం ప్రత్యేకంగా చలివేంద్రాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు చల్లని నీరు, మజ్జిగ అందించి దాహార్తిని తీర్చారు. రహదారిపై వెళ్తున్న వాహనదారులు, కూలీలు, పాదచారులు పెద్ద సంఖ్యలో చలివేంద్రాన్ని వినియోగించుకుని నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సేవా దృక్పథంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలతో పాటు దాతల నుంచి కూడా మంచి సహకారం లభిస్తోందన్నారు. మండుతున్న ఎండల నుంచి ప్రజలకు కొంత ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఈ సేవలను కొనసాగిస్తున్నామని తెలిపారు.

చలివేంద్రం నిర్వాహకుడు మామిడిపల్లి పుణ్యమూర్తి మాట్లాడుతూ వేసవి తీవ్రత పూర్తిగా తగ్గే వరకు ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు వెల్లడించారు. మానవ సేవే మాధవ సేవ అనే భావనతో అయ్యప్ప స్వామి భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

సమాజ సేవలో భాగంగా నిర్వహిస్తున్న ఈ చలివేంద్రం స్థానిక ప్రజలు, ప్రయాణికుల ప్రశంసలు అందుకుంటోంది. కార్యక్రమంలో "స్వామియే శరణం అయ్యప్ప" సేవా బృంద సభ్యులు, భక్తులు పాల్గొని సేవా కార్యక్రమాలను విజయవంతం చేశారు.

## కత్తిపూడి హైస్కూల్లోప్రాథమిక స్థాయి టీచర్స్ వృత్యంతర శిక్షణా తరగతుల....

**శిక్షణ తరగతులు ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా విద్యా శాఖాధికారి పి.రమేష్**





**శంఖవరం పెన్ పవర్ 04:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం జడ్పీ హైస్కూల్ కత్తిపూడి నందు జరుగుచున్న ప్రాథమిక స్థాయి టీచర్స్ వృత్యంతర శిక్షణా తరగతుల ను కాకినాడ జిల్లా విద్యా శాఖాధికారి పి.రమేష్ ఆకస్మికంగా సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన శిక్షణలో పాల్గొన్న 243 మంది టీచర్స్ ను ఉద్దేశించి మాట్లాడరు.

ఫౌండేషనల్ లిటరసీడ న్యూమరసి శిక్షణ యొక్క ఆవశ్యకత ను...

ప్రాథమిక తరగతులలో విద్యాభ్యాసం బలంగా ఉండాలంటే,

టీచర్స్ అందరూ అంకితభావంతో కష్టపడి పనిచేయాలని,

టీచర్స్ కష్టపడి పనిచేయడం వలన పేద, బలహీన వర్గాల పిల్లలకు మంచి భవిష్యత్తు లభిస్తుందని,

టీచర్లు సమర్ధవంతమైన బోధన ద్వారా ప్రభుత్వ బడులు బలోపేతం అయ్యేలా చూడాలని,

ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం పాఠ్యాంశాలు సకాలంలో పూర్తి చేయడం, వెనుకబాటు పిల్లలకు అదనపు సమయంలో తర్ఫీదు ఇచ్చి,పిల్లల్లో అభ్యాసన స్థాయిలు మెరుగయ్యే వరకూ టీచర్స్ కంటిన్యు గా కృషి చేయాలని ఆయన టీచర్స్ ను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో

మండల విద్యాశాఖ అధికారి లు ఎస్ వి రమణ,టి. గోవింద, స్థానిక హైస్కూల్ హెచ్ఎం ఆర్.ఎస్ లింగేశ్వర రావు, రిసోర్స్ పర్సన్ లు పాల్గొన్నారు.

## శివకుమార్ కుటుంబాన్ని పరామర్శించిన బండారు సందీప్

* **ప్రమాద ఘటనపై విచారం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే తనయుడు**



**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 04;**ఇటీవల పెనికేరు గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు యర్ర హేమ శివకుమార్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు బండారు సందీప్ బుధవారం పరామర్శించారు. శివకుమార్ నివాసానికి వెళ్లిన ఆయన కుటుంబ సభ్యులను కలిసి ప్రమాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యువకుడి అకాల మరణంతో విషాదంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులను బండారు సందీప్ ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో మాట్లాడిన ఆయన, జరిగిన ఘటన ఎంతో బాధాకరమని పేర్కొంటూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇలాంటి విషాదాన్ని ఎదుర్కొనేందుకు కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అవసరమైన సహాయ సహకారాలందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. అనంతరం యువత రోడ్లపై అప్రమత్తంగా వ్యవహరించాలని, వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆయన వెంట ఆలమూరు సొసైటీ అధ్యక్షులు వంటిపల్లి సతీష్, స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని శివకుమార్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.


# ఏడు వారాల వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తజనం

## నిత్య అన్నదానానికి రూ.50,116 విరాళం అందజేసిన దాతలు





**పెన్ పవర్ ఆత్రేయపురం, జూన్ 5 :**"ఏడు వారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం" అనే నమ్మకంతో తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. గురువారం ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి.
ఆలయ సన్నిధిలో నిర్వహించిన అష్టోత్తర శతనామార్చన, నిత్య కళ్యాణోత్సవ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణలో పాల్గొని భక్తులు భోజన ప్రసాదాన్ని స్వీకరించారు.
స్వామివారి దర్శనం అనంతరం పలువురు భక్తులు నిత్య అన్నదానకార్యక్రమానికి తమ వంతు సహకారం అందించారు. రాజానగరం మండలం కానవరం గ్రామానికి చెందిన గాయత్రి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ అధినేత వీరాతి వీర వెంకట సత్యనారాయణమూర్తి, దేవి దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి నిత్య అన్నదానానికి రూ. 50,116 విరాళంగా అందజేశారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో దాతలను ఆశీర్వదించారు. ఆలయ సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి వారిని సత్కరించారు. భక్తుల సహకారంతో ఆలయంలో వివిధ ధార్మిక, సేవా కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని దేవస్థానం అధికారులు తెలిపారు.




## విపత్కర వాతావరణ పరిస్థితుల్లోపనిచేస్తున్న ఉపాధి కూలీల పట్ల ఎంపీపీ ఉదారత.

లింగంపర్తి, చిన్నింపేట, సిరిపురంలో ఉపాధి కూలీలకు దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ.





**ఏలేశ్వరం, పెన్ పవర్, జూన్ 4:** విపత్కర వాతావరణ పరిస్థితుల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీల పట్ల ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు గొల్లపల్లి నరసింహమూర్తి తన ఉదారత చాటారు. భానుడి ప్రతాపానికి వాతావరణం భగభగ మంటుంది. ఎల్లినో ప్రభావంతో ఉక్క పోతకు కూలీలు విలవిల్లాడు తున్నారు. ఇటువంటి విపత్కర వాతావరణ పరిస్థితుల్లో పొట్టకూటికోసం ఉపాధి కూలీలు మండుటెండలో పనిచేయాల్సిన పరిస్థితిలు ఉన్నాయి. ఇటీవల ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఉపాధి కూలీ ఎండ తీవ్రత భరించలేక మృతి చెందాడు. కానీ ఏలేశ్వరం మండలంలో ఉపాధి కూలీలను రక్షించేందుకు నేనున్నానంటూ ఏలేశ్వరం ఎంపీపీ కూలీలు ప్రతికూల పరిస్థితులు తట్టుకునేందుకు చల్లని మజ్జిగ పంపిణీ చేసి ఉపాధి కూలీల పట్ల ఉదారత చాటారు. ప్రస్తుత వేసవి దృష్ట్యా మండలంలోని లింగంపర్తి, చిన్నింపేట, సిరిపురం గ్రామాల్లో ఉపాధి హామీ శ్రామికులకు ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) శ్రీ సీతా ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మజ్జిగ ప్యాకెట్లు గురువారం పంపిణీ చేశారు. ఎండ వేడిమి నుంచి కూలీలకు ఉపశమనం కలిగించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీపీ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ గొల్లపల్లి తోపాటు ఎన్ డి ఏ కూటమి నాయకులు మండల టీడీపీ అధ్యక్షులు జ్యోతుల పెదబాబు, సొసైటీ అధ్యక్షులు పెంటకోట మోహన్, అన్నవరం ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు దనేకుల వీరభద్రరావు, బిజెపి నాయకుడు కొల్లా శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ ఓనం మంగ, పెంటకోట శ్రీధర్, మాజీ సొసైటీ అధ్యక్షుడు చిక్కాల లక్ష్మణరావు, నూకతాటి ఈశ్వరరావు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్యవటం, తర్లంపూడి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహణ




**కాజులూరు, పెన్ పవర్,జూన్ 4:** కాకినాడ జిల్లా కాజులూరు మండలంలోని ఆర్యవటం, తర్లంపూడి గ్రామాల్లో గురువారం తహశీల్దార్ జి.ఆర్. ఠాగూర్, ఎంపీడీవో జే. రాంబాబు ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఆర్యవటం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన గ్రామసభలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా తహశీల్దార్ జి.ఆర్. ఠాగూర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుబాటులో ఉన్న వివిధ సేవలు, గ్రామాభివృద్ధికి సంబంధించిన అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు తమ సమస్యలను, అవసరాలను గ్రామసభ వేదికగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్మధుసూదన్,గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలు, ఉపాధి హామీ పథకం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివరాలు తెలియజేశారు.
గ్రామసభలో జడ్పీటీసీ సభ్యులు వనం వెంకట సుబ్బారావు,కూటమి నాయకులు కోట తాతబ్బాయి, చందాల ఆదినారాయణ, ఏపీవో బి. వెంకటలక్ష్మి, ఏపీఎం రాము, ఆర్ఐ పి. వేగేశ్వరరావు, పంచాయతీ రాజ్ జేఈ భవాని శంకర్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, వీఆర్వో రాయుడు, సచివాలయ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే గ్రామసభల ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు.

## భగవద్గీత పోటీల్లో ఏలేశ్వరం చిన్నారులకు బంగారు పథకాలు.

మైసూరు దత్తపీఠంలో అక్కాతమ్ముళ్ల ప్రతిభ.



**ఏలేశ్వరం, పెన్ పవర్, జూన్ 4**:మైసూరులోని గణపతి సచ్చిదానంద స్వామి దత్తపీఠంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి భగవద్గీత పారాయణ పోటీల్లో ఏలేశ్వరం పట్టణానికి చెందిన అక్కాతమ్ముళ్లు బంగారు పథకాలు సాధించి ఔరా అనిపించారు. వివరాల్లోకి వెళితే, స్థానిక దిబ్బలపాలెంకు చెందిన దాకామఱ్రి లోవరాజు, మల్లీ శ్వరి దంపతుల కుమార్తె గహన సంయుత నాయకి నాలుగో తరగతి చదువుతూ జూనియర్స్ విభాగంలో, కుమారుడు యస్వీరా సూర్య కార్తీక్ ఒకటో తరగతి చదువుతూ సబ్ జూనియర్స్ విభాగంలో బంగారు పథకాలు కైవసం చేసుకున్నారు. భగవద్గీతలోని 18 అధ్యాయాలు, 700 శ్లోకాలపై ఐదు రోజులపాటు పోటీలు నిర్వహించారు.
గురువారం సంకట హర చతుర్థి సందర్భంగా స్థానిక పాత బస్ స్టాండ్ ఎదురుగా ఉన్న శ్రీ లక్ష్మి గణపతి ఆలయంలో మండల విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సత్సంగం కార్యక్రమం లో ఈ చిన్నారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విహెచ్‌పీ జిల్లా సంస్కృతి విభాగ్ ప్రముఖ్ కటకం కిరీటి మాట్లాడుతూ చిన్నారుల విజయంలో తల్లిదండ్రుల కృషి ప్రశంసనీయం అన్నారు. అనంతరం గణపతి కళ్యాణ గానామృతం, భగవత్ గీత, దేశభక్తి గీతాలు ఆలపించారు.ఈ కార్యక్రమంలో మండల విహెచ్‌పీ నాయకులు అలమండ దుర్గా వెంకట ప్రసాద్, కార్యదర్శి పి.దేవి, ఆర్గనైజర్ కె.ఇందిర, కోశాధికారి జి.సత్యనారాయణ, సహా కార్యదర్శులు గిరిజ, కామాక్షి, స్వరాజ్యం, రేవతి, గౌరవ అధ్యక్షులు జి.మహాలక్ష్మి, శారద, లక్ష్మి టీచర్, రమ్య, బేబీ, సౌజన్య, తూమురోతు గుఱ్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాలో 46 మంది అభ్యర్థుల ఎంపిక



**రామచంద్రపురం, పెన్ పవర్,జూన్ 4:** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరియు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామచంద్రపురం నియోజకవర్గంలో నిరుద్యోగ నిర్మూలన లక్ష్యంగా ప్రతి వారం నిర్వహిస్తున్న జాబ్ మేళాలకు విశేష స్పందన లభిస్తోంది.ఈ క్రమంలో రామచంద్రపురం ఉపాధి భవన్‌లో నిర్వహించిన 44వ జాబ్ మేళాలో మొత్తం 46 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో ఏజీ ఇండస్ట్రీస్‌కు 20 మంది, డైకిన్ కంపెనీకి 13 మంది,బ్లింకిట్ కంపెనీకి 6 మంది,టాటా ఎలక్ట్రానిక్స్‌కు 3 మంది, ఫాక్స్‌కాన్‌కు 2 మంది, ఈ-ప్యాక్‌కు 1 మంది, ఎన్ఎస్ఎస్‌కు 1 మంది ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.హెచ్ఆర్ ప్రతినిధులు నవీన్ కుమార్ మరియు గంగరాజు ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించగా,అభ్యర్థుల అర్హతలు, నైపుణ్యాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ చేపట్టారు.ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం,రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్,అలాగే ఉపాధి భవన్ అధినేత రామ్ కుమార్లకు కృతజ్ఞతలు తెలిపారు.నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ జాబ్ మేళాలను నిరంతరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

## కత్తిపూడి లో కూటమి ప్రభుత్వ మోసాలపై వైసీపీ నిరసన....



**శంఖవరం పెన్ పవర్ జూన్ 04:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి లో కూటమి ప్రభుత్వ మోసాలపై వైసీపీ నిరసన కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలతో ప్రజలను వంచించి, ఆంధ్రప్రదేశ్ కు వెన్నుపోటు పొడిచి రెండేళ్ల పూర్తవుతున్న సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు పిలుపు మేరకు శంఖవరం మండలం కత్తిపూడి లో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. శంఖవరం మండలం వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో చంద్రబాబు మేనిఫెస్టోను, పత్రికా ప్రకటన లను మరియు వారి పథకాలకు సంతకాలు చేసిన బాండ్లను రోడ్డుపై తగలబెట్టి నిరసన తెలియజేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై వైసీపీ శ్రేణులు గళమెత్తాయి. ఈ కార్యక్రమంలో శంకవరం మండల కన్వీనర్ నరాల శ్రీనివాస్ భారీ స్థాయిలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రావులపాలెం ఎల్ఐసీ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎం.ఎన్. స్వామికి ఘన వీడ్కోలు

సేవా కాలంలో శాఖ అభివృద్ధికి విశేష కృషి చేశారన్న అధికారులు



**పెన్ పవర్ రావులపాలెం, జూన్ 4:**రావులపాలెం ఎల్ఐసీ సీనియర్ బ్రాంచ్ మేనేజర్‌గా విధులు నిర్వహించి రాజోలు శాఖకు బదిలీపై వెళ్తున్న ఎం.ఎన్. స్వామికి గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఎల్ఐసీ కార్యాలయంలో నూతన బ్రాంచ్ మేనేజర్ ఎం. బెన్నయ్య నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎం.ఎన్. స్వామికి శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ స్వామి తన సేవా కాలంలో శాఖ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఉద్యోగులు, ఏజెంట్లతో సత్సంబంధాలు కొనసాగిస్తూ సంస్థ ప్రగతికి కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో శాఖ అనేక విజయాలు సాధించిందని గుర్తు చేశారు.ఎం.ఎన్. స్వామి మాట్లాడుతూ రావులపాలెం శాఖలో పనిచేసిన కాలం తనకు మరపురానిదని అన్నారు. విధుల నిర్వహణలో సహకరించిన అధికారులు, ఉద్యోగులు, ఏజెంట్లకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన బ్రాంచ్ మేనేజర్ ఎం. బెన్నయ్య నాయుడు నాయకత్వంలో శాఖ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.
కార్యక్రమంలో ఎల్ఐసీ అధికారులు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్లు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాలువలో పడి మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభ్యం



**ఆలమూరు, పెన్ పవర్, జూన్ 04;** ఆలమూరు మండలంలోని మడికి జాతీయ రహదారి చెంతన ఉన్న ధవలేశ్వరం నుండి ప్రవహించే ప్రధాన పంట కాలువలో మంగళవారం శవమై తేలిన వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. మృతుడు చెముడులంక గ్రామానికి చెందిన గళ్లా కృష్ణ మహేశ్వరరావు(బుజ్జి)(42)గా పోలీసులు గుర్తించారు. సోషల్ మీడియా, వార్తాపత్రికల ద్వారా విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు బుధవారం పోలీసులను ఆశ్రయించారు. ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి మృతి చెందినట్లు పోలీసులు తెలియజేశారు. ఎస్సై నరేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి స్థానిక ఏరియా ఆసుపత్రిలో శవ పరీక్షలు నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.మృతుడికి తల్లి,తండ్రి, ఒక సోదరుడు ఉన్నారు. కృష్ణ మహేశ్వరరావు మృతితో చెముడులంకలో విషాధచాయలు అలుముకున్నాయి.

